



నాకు___పై చదువులు చదువు పడుతూ, వారాలు చేసుకుంటూ,
కోవాలని ఉత్సాహం వుండీ, పట్టుదలగా చదువు కొనసాగించే
చెప్పించేవారు లేక, అష్టకష్టాలు వారంటే అమితమైన జాలి.

అందుకనే-నాకంటే పై వుద్యోగులు సైతం రూపాయి, అర్థ, పావలా యిచ్చిన సత్యానికి నేను రెండు రూపాయలిచ్చి, "నాల్రోజులు పోయాక మళ్ళీరా. మళ్ళీ ఏదైనా యిస్తాను" అన్నాను—రాబోయే మెడికల్ అలవెన్స్ని తలుచుకుంటూ. అలాగే నాలుగు రోజులు పోయాక వచ్చిన సత్యానికి అయిదు రూపాయలిచ్చి, "ఎలా వుందోయ్ చదువు?" అన్నాను, ప్రక్క బల్లమీద కూర్చోమని సైగచేస్తూ.

"థాంక్సండీ" అని కూర్చుని, "బాగానే కష్టపడి చదువుతున్నాను సార్! మీలాంటివారి దయవల్ల ఆటంకం ఏదీ లేదు" అన్నాడు.

"మీ అమ్మ, నాన్నా ఏ వూళ్లో వున్నారు సత్యం?"

చెప్పాడు.

"వాళ్ళకు నువ్వు చదువుకోవడం యిష్టంలేదా?"

"ఇష్టంలేక కాదుసార్! అది పల్లెటూరయి పోవడంతో అందరూ కూడా 'చదువెందుకూ? ఏదో పని చూసుకో కూడదా?' అంటారు. చదువు విలువ సరిగ్గా ఎరుగని వాళ్లూ వాళ్ళ మాటే, రైటంటారు. నాకేమో బాగా చదువుకుని, మంచి వుద్యోగం సంపాదించుకుని చెల్లెళ్ళిద్దరికీ మంచి సంబంధాలు తెచ్చి పెళ్ళిళ్ళుచేసి, అమ్మా నాన్నలను సుఖపెట్టాలని కోరిక. వాళ్ళేమో 'వున్న కొద్ది ఆస్తీ అమ్మేసి, పట్నంలో నిన్ను చదివించలేం పొమ్మ'న్నారు. నా కాళ్ళమీద నేనే నిలబడతానని బయటకొచ్చేశాను సార్" అన్నాడు వినయంగా, ఆత్మ విశ్వాసంగా.

"గుడ్! నువ్వు స్పోర్ట్స్ కూడా ఆడతావేమిటోయ్ సత్యం?" అన్నాను దృఢంగా వున్న అతని శరీరం వంక పరికించి చూస్తూ.

రెట్టింపు వుత్సాహంతో చెప్పాడు సత్యం—"అవున్సార్! చిన్నప్పట్నించీ ఎక్సర్‌సైజ్ బాడీ సార్ నాది. మా కాలేజీ కబడ్డీ, వాలిబాల్ ఛాంపియన్‌ని. ఈ స్పోర్ట్సు, స్టడీస్‌లలో మంచి సర్టిఫికెట్లు తెచ్చుకుని, మీవంటి వారి సహాయం వుంటుంది కాబట్టి వుద్యోగం సంపాదించుకోవడం పెద్ద కష్టం కాదనుకుంటున్నాను సార్!"

ఏదో వింత వుత్సాహంతో చెపుతూన్న అతని కళ్ళల్లో ఆనంద భాష్పాలు నిలిచాయి.

నేను కొంచెం మొహమ్మాటపడ్తూ, "నా సహాయమేముందోయ్-సముద్రంలో నీటి చుక్క. అంతా

ఆ పైన వాడి దయ, నీ కార్య దీక్ష. ఓ.కే. బెస్టాఫ్ లక్. పోయిరా" అన్నాను అతని భుజం తడ్తూ.

సవినయంగా నమస్కరించి వెళ్ళిపోయాడు సత్యం.

* * *

ఏజీసాఫీసులో పన్జేసే— క్షమించాలి—'జీతం తీసుకునే' చిట్టిబాబు చిన్నప్పట్నుంచీ నాకు ఫ్రెండు. నాకు తెలిసినంతవరకు ఉద్యోగంలో జేరాక వాడు కాగితం మీద కలంతో సిరా విదిపి ఎరుగడు. గంటల తరబడి కడుపు నింపేసే కబుర్లు చెప్పమంటే—రాజకీయా లేమిటి, నాటకా లేమిటి, పతివ్రతల గురించీ, పతితల గురించీ, అప్పుల గురించీ, కొప్పుల గురించీ.... యిదీ అదీ అని లేదు—ఏకధాటిగా, ధారాళంగా వుపన్యసించేస్తాడు. వాడి కబుర్లతో సంబరపడే వాళ్ళ సూపర్నెంటు, సహ వుద్యోగులు పనిచేయమని బలవంత పెట్టి, సున్నితమైన వాడి మనసుని నొప్పించలేరు.

ఆ రోజు బ్యాంకుకి సి. ఎల్. పారేసి, వాడి దగ్గరకు పోయి కూర్చుని కబుర్లాడుతున్నాను. మా చిన్ననాటి సంఘటనలు డైలాగ్స్‌తో సహా వరుసగా వాడు చెబ్తూంటే నాకు ఆనందాన్ని మించి ఆశ్చర్యం కలిగింది—వాడికి అంత మెమరీ పవర్ ఏడ్చినందుకు.

మా ఆనందానికి బ్రేక్‌లా ఒక సన్నటి రివటలాంటి అబ్బాయి చేతిలో తెరిచిన పుస్తకంతో ఆ హాలులోకి ప్రవేశించి, ఒక్కొక్కరికీ చూపిస్తూ, వాళ్ళిచ్చింది పుచ్చుకుంటూ నా దగ్గరకొచ్చి పుస్తకం అందించాడు.

ఆ పుస్తకం అందుకుని చదవ నారంభించాను. నా ఆశ్చర్యం నన్ను పిచ్చివాణ్ని చేసింది.

తల తిరిగిపోయింది.

"చదివావు లేరా పెద్ద...." అంటూ నా చేతుల్లోంచి పుస్తకాన్ని లాక్కుని సంతకంపెట్టి, దాన్నీ, ఓ రూపాయి నోటునీ ఆ అబ్బాయికి అందించాడు చిట్టిబాబు.

ఓ నమస్కారం పెట్టి, బయటకు నడిచాడు ఆ అబ్బాయి.

"ఒరేయ్ బాలూ! నీకిది గుర్తుందా? ఓసారి అట్లతద్దికి శర్మగారమ్మాయి చెరువు గట్టున ఉయ్యాల ఊగుతూంటే...." అంటూ రూమంతా దద్దరిల్లిపోయేలా నవ్వుతూ చిట్టిబాబు ఏదో చెప్పబోతూంటే - కళ్ళతోనే ఆగమని వాడిని వారించి, "రెండు నిముషాల్లో వస్తాన్రా" అని, బయటకు నడిచాను గబగబా.

పరుగులా నడిచి, ఆ అబ్బాయి భుజంమీద చెయ్యి వేశాను.

ఉలిక్కిపడి చూశాడు అతను నా వైపు.

నవ్వేను.

అయోమయంగా చూశాడు.

"నీపేరు 'సత్యం' కదూ?" అన్నాను- 'సత్యం' అనే పదాన్ని నొక్కి పలుకుతూ.

తూలినట్టయి, అవునన్నట్లు తలూపాడు బెదిరే కళ్ళతో.

"అలా క్యాంటీన్‌లో కూర్చుని కాఫీ తాగుదాం పద" అని తీసుకు పోయాను.

రెండు కాఫీలకు ఆర్డరిచ్చి, అతని చేతిలోని పుస్తకం తీసుకుని, పేజీ తిరగేసాను.

"డియర్ సర్/మేడమ్!

ఈ అబ్బాయి పేరు సత్యం. ఉత్తమ వంశానికి చెందిన బీద వాడు. పరిస్థితుల ప్రభావం వలన వీళ్ళ కుటుంబం చితికిపోయింది. ఈతని తల్లిదండ్రులు నిరక్ష రాస్యులు, వృద్ధులు-తమ పల్లెలో కాలం వెళ్ళబుచ్చుతున్నారు. పై చదువులు చదువుకుని, పెద్దవాడ వ్వాలనే సత్సంకల్పంతో ఈ నగ రానికి వచ్చిన ఈ తెలివైన పేద విద్యార్థికి ఇతోధిక సహాయంచేసి, చేయూత నీయవలసిందిగా మనః పూర్వకంగా కోరుతున్నాము."

క్రింద ఒక లాయరు గారిది, ఒక డాక్టరుగారిది సంతకాలు రబ్బరు స్టాంపు ముద్రలతో సహా, ఉన్నాయి.

ఏం మాట్లాడలేదు నేను. అలాగే చూస్తూ, పేజీలు తిరగే సాను. ఒక పేజీలో మా ఆఫీసు వాళ్ళు పెట్టిన సంతకాలు ఉన్నాయి.

కాఫీలొచ్చాయి.

"తీసుకో" అన్నాను.

కప్పు తీసుకుంటూ, మీద ఒలక బోసుకున్నాడు.

అతని కళ్ళల్లోకి సూటిగా చూశాను.

కప్పు దడదడలాడింది.

గబుక్కున నవ్వి, "కాఫీ త్రాగు" అన్నాను.

నెమ్మదిగా త్రాగుతున్నాడు. నుదుట చెమట పొటమరించింది.

"ఈ పుస్తకం నీకెలావచ్చింది?"

గబుక్కున బల్లమీద కప్పు పెట్టేసి, "సార్" అని పొరబోయి, బాగా దగ్గాడు. అతను సర్దుకోవ డానికి ఓ నిముషం టైమిచ్చి, "ఈ పుస్తకం నీకెలా వచ్చింది?" అన్నాను తాపీగా.

"న....న్నాదే సార్!"

"నీదా?___ఊం..మా బ్యాంకుకి, వచ్చినతను ఎవరు?"

"ఏ బ్యాంకు సార్?"

"ఆంధ్రా బ్యాంకు."

"మీరు ఆంధ్రా బ్యాంకులో పన్జేస్తారా సార్?" అన్నాడు కంగారుగా, మూతిపైనున్న చెమటని జబ్బకు తుడుచుకుంటూ.

"అదంతా ఎందుకూ? నువ్వు కాదుగా వచ్చింది?" అన్నాను కటువుగా.

అతని కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

"క్షమించండి సార్! ఇది మా స్నేహితుడి పుస్తకం. అతనే సత్యం. అతను ఊరెళ్ళాడు. నేను ఉపయోగించుకున్నాను" అన్నాడు తలవంచుకుని.

నన్ను నేనే నమ్మలేనట్లుగా వుంది నా పరిస్థితి.

ఓ నిముషం పోయేక, "నీ పేరు?" అని కసిరినట్లు అడిగాను.

"ర....రాజా సార్!"

"ఊఁ....సత్యం ఎప్పుడొస్తాడు?"

"ఈవాళే....ఈపాటికి రూంలోనే వుంటాడు. సత్యం మీకు తెలుసాండీ?"

"పద-నేనూ వస్తా మీ రూమ్కి."

"సార్! మీరు...."

"పదవయ్యా-చెప్పావుగానీ."

* * *

వాళ్ళ రూముకి చేరడానికి చాలా సందులే తిరిగాం. చాలా మురికి లొకాలిటీ. చివరకు ఒక పెంకుటింటి వెనక భాగంలో శిథిలావస్థలో వున్న ఒక రూము ముందు నిలిచాం.

'ఇదే మా రూము' అన్నట్లుగా చూసాడు రాజా.

"సత్యం లోపల వున్నాడేమో పిలువ్" అన్నాను గట్టిగా.

"ఎవరదీ?" అంటూ బయట కొచ్చాడు సత్యం. లుంగీ, బనీనుతో వున్నాడు. మా యిద్దరినీ చూసి ఆశ్చర్యపోయాడు. త్వరగా ముఖంలో రంగులు మారాయి. నన్ను త్వరగానే గుర్తు పట్టాడు.

గబగబా లోపల్నుంచి కుర్చీ తెచ్చి వేసి, "నమస్కారం సార్! కూర్చోండి" అని, "రాజా! నువ్వు మాట్లాడుతూండు. క్షణంలో కాఫీ కలిపి తెస్తా" అని లోపలికి పోబోయాడు.

"కాదు. నీతోనే మాట్లాడాలి. రాజాని వెళ్ళనియ్యి" అన్నాను.

"మంచిది సార్! రాజా! నువ్వా పని చూడు" అని, చేతులు కట్టుకుని నిల్చుని. "రాజా మీకెలా తెలుసు సార్? అతన్తో కబురెడితే నేనే వచ్చి మీ ముందు వాలేవాడ్ని. మీరు రావాలా సార్ యీ మురికి సందుల్లోకి?" అన్నాడు.

"ఫర్వాలేదుగానీ, సత్యం! ఆ పుస్తకం రాజా కెందుకిచ్చావు?"

ఆ ప్రశ్న నేనడుగుతానని ఊహించాడు లాగుంది-తడబడ లేదు సత్యం.

"అయామ్ వెరీ సారీ సార్! ఎవర్నీ మోసగించాలని నా వుద్దేశ్యం కాదు. రాజా నా కంటే బీదవాడు. పైగా ఈ వూళ్ళో అతనికి యెవ్వరూ తెలియదు. మంచి కుర్రాడు. నాకు తెలుసున్న వాళ్ళందరికీ పరిచయం చేద్దామంటే నామీదున్న జాలి కూడా పోయి, 'దేశంలో నీలాంటి వాళ్ళెందరు న్నారో అందర్నీ పోగేసి తీసుకురా' అని కోప్పడతారు. నిన్న అమ్మ వాళ్ళని చూద్దామని వూరెళ్తూ, రాజాకి చేతనైన సాయం చేద్దామని...." అని తల వంచుకుని, "ఇదే ఫస్ట్ అండ్ లాస్ట్ టైం సార్! చేతనైతే నాకున్నదాంట్లో అతనికి సాయ పడ్తాను. లేకపోతే నీ దారి నువ్వు చూసుకోరా అబ్బాయ్ అంటాను గానీ-ఈ పని మాత్రం-ప్రామిస్ సార్-నా మాట నమ్మండి-ఇంకె ప్పుడూ ఇలా జరగదు." అతని కను రెప్పల మధ్య నీళ్ళు నిండాయి.

తల పంకించి, ఆలోచిస్తూ వుండిపోయాను.

రాజా కాఫీ తెచ్చాడు.

రెండు గుక్కలు చప్పరించి, "వెల్ అబ్బాయిలూ! మీరు సరిగ్గా ఏడున్నరకి గుళ్ళ చెరువు దగ్గరకి రండయ్యా. ఓ ముఖ్యమైన పనుంది" అని లేచాను.

'ఎందుకు?' అని అడగబోయి, యిద్దరూ ముఖాలు చూసుకుని, "సరే సార్!" అన్నారు ఒక్క సారే.

"తప్పకుండా రావాలి సుమా! నేను మీ కోసం యెదురు చూస్తూంటా. అన్నట్లు, ఈ పుస్తకం కూడా తేవాలి" అని గబ గబా నడుచుకుంటూ వెళ్ళిపోయాను.

* * *

ఏడింటికే నేనూ, శ్రీహరిరావు గారూ గుళ్ళ చెరువు దగ్గర చేరాం.

సరిగ్గా ఏడున్నరకి సత్యం, రాజా వచ్చి చేతులు జోడించారు.

"గుడ్! పంక్చ్యువాలిటీ అంటే అలా వుండాలి. కూర్చోండి. వీరు శ్రీహరిరావుగారని గొప్ప లాయరు. చిక్కడపల్లిలో వుంటున్నారు. వీళ్లే నండీ నేను చెప్పిన కుర్రాళ్ళు" అని పరిచయం చేసాను.

వాళ్ళు నమస్కరిస్తే, నవ్వుతూ తల వూపారాయన.

• సవివరంగా పరిచయం జరగ డానికి మరో అయిదు నిమిషాలు పట్టింది.

"ఇక అసలు విషయం-వీరు ఒక బీద విద్యార్థికి పూర్తిగా సాయ పడాలనుకుంటున్నారు. అంటే మూడు పూట్లా తిండి పెట్టి, మూడు నెలల కొక జత బట్టలు పెట్టి, ఫీజులు కట్టి, చిన్న రూమిచ్చి, పుస్తకాలు కొనిపెట్టి చదివిస్తారు. ఇవి ఆయన కలిపించే సౌకర్యాలు. ఇక ఆ బీద విద్యార్థి బాధ్యతలేమి టంటే-ఈయనకు యిద్దరు కొడుకు లున్నారు-పదేళ్లు, పన్నెండేళ్ల వాళ్లు. ఇద్దరూ వాలి సుగ్రీవులు" అని ఆయన వైపు ఓ చిరునవ్వు విసిరి, ఆయన నవ్వుని అందుకుని, "వాళ్ళని ఓ దారికి తేవాలి. ఈయన కున్న బాధ్యతల వత్తిడిలో వాళ్ళ గురించి ఎక్కువగా పట్టించుకోలేక పోతున్నారు. కాబట్టి వాళ్లు సరిగ్గా చదువుకుని, మంచి దారిలో నడిచేలా కంటికి రెప్పలా వాళ్ళని చూసు కుంటూ, రోజూ వాళ్ళని సైకిల్ మీద స్కూల్ దగ్గర దింపడం, ఇంటికి తీసుకు రావడం, ఏ రోజు పాఠాలు ఆ రోజు వాళ్ళ చేత చెప్పించడం, తెలియనివి చెప్పడం, మంచి మంచి విషయాలు చెప్పడం చేసి, వాళ్ళ పూర్తి బాధ్యత వహిం చాలి. ఇది నిజంగా కష్టపడి చదువు కునే బీద విద్యార్థులకి ఒక గొప్ప అవకాశం. మీ యిద్దరిలో ఒకరికి ఆ ఛాన్సు యివ్వాలని యిలా సమా వేశ పరిచాను. సత్యం! నీకు యిస్తున్నాం మొదటి ఛాన్సు. నీకు సమ్మతమేనంటే రాజా విషయం మనందరం ఆలోచిద్దాం" అన్నాను అతని ముఖంలోకి పరిశీలనగా చూస్తూ.

శ్రీహరిరావుగారు వాళ్ళిద్దర్నీ స్టడీ చేస్తున్నారు.

సత్యం సూటిగా రెప్ప వాల్చ కుండా నీట్లోకి చూస్తున్నాడు.

రాజా తల వంచుకుని, ఏదో ఆలోచనలో వున్నాడు.

అయిదు నిమిషాలు ఆలోచించు కోవడానికి టైమిచ్చి, "ఏమంటావు సత్యం?" అన్నాను.

అదోలా నవ్వి, అతి చిన్న స్వరంతో, "క్షమించాలి సార్! నా చదువుకే సమయం చాలడం లేదు. ఈ బాధ్యతలు...." అంటూ నసిగాడు.

చిన్నబోయి చూసాను శ్రీహరి రావుగారి వైపు.

ఆయన తల నిలువుగా ఆడించి రాజావైపు కళ్ళుత్రిప్పి, "ఆ అబ్బా యికి ఓ ఛాన్సివ్వండి. ఇందులో బలవంతం ఏముంది?" అన్నాడు.

"ఏం రాజా?" అన్నాను.

"అంతకంటే అదృష్టం వుం టుందా సార్! ఈ అవకాశం నా

కిస్తే మీ యిద్దరి మేలూ యీ జన్మలో మరిచిపోలేను" అన్నాడు ఉత్సాహంగా.

శ్రీహరిరావుగారూ, నేనూ మొహమొహాలు చూసుకుని, గుండెల నిండా వూపిరి పీల్చుకున్నాం.

"సత్యం! ఆ పుస్తకం వారి కియ్యి" అని, "అయ్యా! మీకు తోచింది...." అన్నాను చిరునవ్వుతో.

లైటు స్థంభం వెలుతురు పడుతున్న వైపు తిరిగి, మొదటి పేజీ చదివి, క్రింద ఏదో వ్రాసి యిచ్చాడాయన.

పుస్తకం అందుకుని, చదివాను.

"అదేవిఁటి సార్! మొదటి పేజీలో వ్రాసారూ?" అంటూ, కంగారుగా నా ప్రక్కకు జరిగి, ఆందోళనగా తనూ చదివాడు సత్యం.

'బీద విద్యార్థులకు సాయపడమని పరిచయ వాక్యాలు వ్రాసే పెద్దలు- ఆ విద్యార్థికి సంబంధించిన గుర్తులుకూడా వ్రాయడమో, లేక అతని ఫోటో అంటించి, దానిమీద సంతకం చేయడమో చేస్తే, అనేక మోసాలు అరికట్టవచ్చు ననుకుంటాను. వేరే ఏదైనా మార్గంవుంటే మరీ మంచిది. లేకపోతే యిది కొందరు మోసగాళ్ళకి లాభసాటి వ్యాపారమయిపోతుంది.' అని ఎర్రసిరాతో పెద్దపెద్ద అక్షరాలతో వ్రాసి, క్రింద సంతకం పెట్టి, తన పూర్తి చిరునామా వ్రాసారు.

అది చదువుతూనే-నా పెదవుల మీద చిరునవ్వు పుట్టింది.

సత్యం ముఖం కోపంతో బిగుసుకు పోయింది.

"ఇది అన్యాయం. మీ రింకా పెద్ద మనషులనుకున్నా. నా పుస్తకం మీద యిలా రాసే హక్కు మీ కెవడిచ్చాడు? మీకు బుద్ధీ-జ్ఞానం లేదా? అన్నమా- గడ్డా మీరు తింటున్నది?" అంటూ తాటి ప్రమాణంలో రయ్యిన లేచాడు ఆయనమీద.

నేనూ గబుక్కున లేచి, అతని కాలరు పట్టుకుని, "యూ స్టుపిడ్! నువ్వట్రా ఆయన్ను తిట్టేది? నీలాంటి గోముఖ వ్యాఘ్రాలకు యిది చాలదు" అంటూ గొంతు పట్టుకుని నొక్కాను.

ఉక్కిరి బిక్కిరి అవుతూండగా చేతులు జోడించాడు వాడు.

"సర్వం సమకూర్చి చదివిస్తాను- కొంచెం బాధ్యతలు మొయ్యమంటే భారమా నీకు? అడుక్కొని, తైతక్క లాడడం

సులభమా? నీ స్వభావమే నీ మోసాన్ని బయట పెడ్తోంది. చెప్పు- ఎవరిదీ పుస్తకం? నిజం చెప్పావా సరి! లేకపోతే- నీ అంతం చూస్తాను" అంటూ కంఠం చుట్టూ వ్రేళ్ళు బిగించాను గట్టిగా.

"చెప్తాను- వదలండి సార్! అమ్మ.... అబ్బ...."

"ఊఁ- చెప్పు!"

"నా పేరు నాగరాజు. ఈ రాజాయే సత్యం. ఈ పుస్తకం అతనిదే. అతన్ని భయపెట్టి, నా చెప్పుచేతల్లో పెట్టుకున్నాను. ఎప్పుడు డబ్బులు కావలిస్తే అప్పుడు ఆ పుస్తకంతో ఆఫీసుల చుట్టూ తిరిగి డబ్బు సంపాదించి, జల్సా చేస్తా. నా కవసరం లేనప్పుడు, ఎక్కువగా నన్నెరుగని ఆఫీసులకి యితన్ని పంపిస్తాను. అతను తెచ్చిన దాంట్లో కూడా నాకు వాటా వుంటుంది. నేను స్టూడెంటుని కాదు. నాకు అమ్మా నాన్నా అంతా వున్నారు. ఇంక జన్మలో ఈ పని చెయ్యను. మీ అందరికీ క్షమాపణలు చెప్పుకుంటున్నాను. ఏమీ దాచకుండా నిజం చెప్పేసాను కాబట్టి నన్నొదిలెయ్యండి" అంటూ బ్రతిమలాడసాగాడు.

"నిన్నొదలాలా?" అని, తల వంచి చెయ్యి పైకెత్తాను.

గబుక్కున నా చెయ్యి పట్టుకున్నాడు రాజా-కాదు సత్యం.

"నా ముఖం చూసి, వదిలిపెట్టండి సార్!" అన్నాడు.

"ఇలాంటివాడ్ని వదలడమా?"

"ప్లీజ్! వదిలెయ్యండి సార్!" అన్నాడు జాలిగా.

"నువ్వు చెబుతున్నావు కాబట్టి" అని, నాగరాజుని వదిలిపెట్టి, "ఫో! మళ్ళీ యిలాంటి వెధవ పని చేసినా, సత్యం జోలికి వచ్చినా, నీ చావు మూడిందన్న మాటే- జాగర్త!" అని ఒక్కతోపు తోశాను.

వెనక్కి చూడకుండా గబగబా వెళ్ళిపోయాడు వాడు.

నవ్వుతూ శ్రీహరిరావు గారి వైపు తిరిగాను.

నన్ను భుజం తట్టి, అభినందించి, సత్యం వైపు తిరిగి, ఆప్యాయంగా, చాలానాళ్ళకు కనిపించిన కన్న కొడుకుని చూస్తున్నట్లు చూస్తూ, అతని భుజాల మీద చేతులు వేశారు.

సత్యం ముఖం వింత ఆనందంతో వెలుగుతోంది.

"మబ్బుల చాటు చంద్రుడు బయట కొచ్చాడోయ్" అన్నారు శ్రీహరిరావుగారు నాతో. ✱